క్లుప్తంగా

ఘనంగా శ్రీలక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్‌లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీ గణపతి హోమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకుని జరిగిన ఈ పూజా కార్యక్రమంలో 114 మంది ఉభయదాతలు పాల్గొని పూజలు నిర్వహించారు. సమాజ శ్రేయస్సు, లోక కల్యాణం కోసం ఈ పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు.

విజయదుర్గమ్మకు మంగళ సూత్రాల సమర్పణ



ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో అమ్మవారికి దాతలు శుక్రవారం బంగారు మంగళ సూత్రాలు సమర్పించారు. ఊటుకూరు శివారు ప్రొద్దుటూరుకు చెందిన కాగిత చలపతిరావు దంపతులు ఈ సూత్రాలను సమర్పించారు. శుక్రవారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మంగళ సూత్రాలు సమర్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ నిర్వాహకుడు దాసరి భగవాన్ దాస్ తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత



గుడివాడ టౌన్: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో కళాజాత నిర్వహిస్తున్నట్లు యడవల్లి వీరయ్య కల్చరల్ సొసైటీ కళాకారులు తెలిపారు. పట్టణంలోని ఐసీటీసీ సెంటర్లు, ఏఆర్టీ సెంటర్‌లు, పలు కూడళ్లలో ఈ జాత శుక్రవారం నిర్వహించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎయిడ్స్, లెప్రసీ నివారణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈ జాత నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సార్వత్రిక సమ్మె వాయిదా



గుడివాడ టౌన్: ఈనెల 20వ తేదీన నిర్వహించాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె అనివార్య కారణాలతో జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమ్మెకు కావాల్సిన ఏర్పాట్లలో భాగంగా జిల్లా స్థాయిలో సమావేశాలు, సమీకరణలు, ప్రచారం జరుపుతామన్నారు. గ్రామ సచివాలయాల్లో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ, వృత్తి సంఘాల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. సీపీఎం నాయకులు బి. రమేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పామర్రు: ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయుక్తం అవుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 24 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశామని తెలిపారు. నాయకులు పరసా సుబ్రమణ్యం, ఎం.ఆంజనేయులు, సందీప్ పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం చండీహోమం

పెడన: లోక కల్యాణార్థం దేశం సస్యశ్యామలానికి దేవాంగ అర్చక పురోహిత సిద్ధాంత బృందం శుక్రవారం హోమం నిర్వహించింది. పట్టణంలోని 23వ వార్డు బ్రహ్మపురం శ్రీరామలింగ చౌడేశ్వరి భజన గుడి వద్ద బృందం వారు శుక్రవారం హోమం జరిగింది. దేశ సరిహద్దులలో ఏర్పడిన యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశ సంరక్షణార్థం ఈ హోమం నిర్వహిస్తున్నట్లు ఆ బృంద అధ్యక్షుడు వుట్ల తిరుమలరావు తెలిపారు. పెడన, కప్పలదొడ్డి, మల్లవోలు, పోలవరం, చింతగుండపాలెం, చల్లపల్లి ప్రాంతాలలకు చెందిన దేవాంగ అర్చక పురోహిత సిద్ధాంతులు పాల్గొన్నారు.

‘బోరు’ బోరుమంటూ..

- బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వని అధికారులు
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



గత ప్రభుత్వ హయాంలో బోరును ప్రారంభించిన నాయకులు (ఫైల్)

పామర్రు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బోరు బావులకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన ప్రవేశ పెట్టిన పథకాల్లో వైఎస్సార్ జలకళ ఒకటి. దీని ద్వారా సన్న, చిన్న కారు రైతులకు ఉచితంగా బోర్లు వేయించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం మానేసింది. దీంతో సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు.

రైతులకు అండగా..

గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లకు అమల్లోకి వచ్చిన వైఎస్సార్ జలకళ పథకం ద్వారా నియోజకవర్గంలో 124 మంది సన్న, చిన్నకారు రైతులు బోర్లు వేసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో సన్న చిన్న కారు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న వైఎస్సార్ జలకళ పథకాన్ని పాలకులు పక్కన పెట్టారు. దీంతో బోర్లు వేసుకుని విద్యుత్ సదుపాయం లేక పలువరు రైతులు ఏడాది నుంచి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

వేడుకుంటున్నా..

విద్యుత్ కనెక్షన్ల కోసం సంబంధిత అధికారులను రైతులు వేడుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. జలకళ పథకమే లేదని, మీకు విద్యుత్ కనెక్షన్ ఇలా ఇచ్చేదని అధికారులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ కావాలంటే ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజులు చెల్లించాలని చెబుతున్నారు. దీంతో రైతులకు ఏం చేయాలో తెలియడం లేదు.

రైతు సంక్షేమాన్ని విస్మరించారు.

పామర్రు నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయ బోర్లపై ఆధార పడతారు. గతంలో అప్పులు చేసి బోర్లు వేయించుకునే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అడిగిన ప్రతి రైతుకు వైఎస్సార్ జలకళ పథకంలో అప్పటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ బోర్లు వేయించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు రైతు సంక్షేమాన్ని విస్మరించింది. దీంతో బోర్లకు సంబంధించి ఏడాదిగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు కావడం లేదు.

– టీ శ్రీనివాసరావు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

21మంది దరఖాస్తు చేసుకున్నారు

స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 21 మంది రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజులు కట్టి, విద్యుత్ సర్వీసులు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో కొత్త సర్వీసులకు అవకాశం ఉన్న నాలుగు చోట్ల కనెక్షన్లు ఇచ్చాం. మిగిలిన వాటికి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి అదనపు స్తంభాలను వేయాల్సి ఉంది. ప్రస్తుతం జలకళ పథకం అమలులో లేదు.

– కె. సుందరరావు, ఏడీఏ పామర్రు

కిశోర బాలికలకు అవగాహన

పామర్రు: కిశోర బాలికలు రక్త హీనతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సూపర్‌వైజర్ సత్యశ్రీ పేర్కొన్నారు. మండలంలోని పసుమర్రు, జుఝవరం, నిమ్మకూరు, ఎలకుర్రు సచివాలయాల పరిధిలో కిశోర వికాసం వేసవి శిక్షణలో భాగంగా శుక్రవారం రక్తహీనతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార దశలో బాలికలకు రక్తహీనత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్త హీనతను తగ్గించే విటమిన్స్, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలన్నారు.



గుడ్లవల్లేరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వాణి

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: కౌమారదశలో రక్తహీనతబారినపడకుండా బాలికలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉష పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ పరిధిలోని పైడికొండలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే స్రవంతి, అంగనవాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: మండలంలోని తమిరిశ సెక్టార్లో పలు గ్రామాల్లో శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కౌమార దశలో రక్త హీనత బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై వివరించారు. బాలికలు తీసుకోవాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి కార్యకర్తలు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీకేడీ భవాని ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కిశోర బాలికలు తమ కౌమార దశలో రక్త హీనత బారిన పడవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి సూచించారు. గుడ్లవల్లేరులో శుక్రవారం కిశోర వికాసంపై వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. రక్త హీనతకు చెక్ పెట్టేందుకు కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె సూచనలు ఇచ్చారు.

పరిసరాల శుభ్రతతో దోమల నివారణ

తోట్లవల్లూరు: పరిసరాల పరిశుభ్రత ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని డాక్టర్ మాధవి తెలిపారు. డెంగీ నివారణ దినాన్ని పురస్కరించుకుని మండలంలోని చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెంలో శుక్రవారం అవగాహన, ప్రతిజ్ఞ కార్యక్రమాలు జరిగాయి. దోమలతో కలిగే అనర్థాలను డాక్టర్ మాధవి వివరించటంతోపాటు ప్రతిజ్ఞ చేయించారు. సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కళ్లంవారిపాలెంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ మాధవి

కలిదిండిలో..

కలిదిండి (కైకలూరు): పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీను దూరం చేయగలమని కలిదిండి ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.హేమలత పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా కలిదిండిలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వారానికి ఒక పర్యాయం నీటి నిల్వలను శుభ్రం చేసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వల పాత్రలపై మూతలు ఉంచాలన్నారు. డెంగీని అందరం సమష్టిగా రూపుమాపాలని పిలుపునిచ్చారు.



గురజ పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని గురజలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ స్వాతి ఆధ్వర్యంలో సిబ్బంది పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించి, డెంగీ వ్యాధి నివారణ జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ఫ్రై డే –డ్రై డేను పాటించాలని తెలిపారు. పరిసరాల్లో పాతటైర్లు, నీరు నిల్వ ఉండే ప్లాస్టిక్ డబ్బాలు ఇతర పరికరాలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కె.జోనతాన్, హెల్త్ సూపర్‌వైజర్ అబ్దుల్ రహీం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయకులు సక్రమంగా పని చేయాలి

గన్నవరం రూరల్: గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులు డేటా వెరిఫికేషన్ సమర్థంగా పూర్తి చేయాలని గన్నవరం అగ్రికల్చర్ ఏడీఏ ఎం.సునీల్ ఆదేశించారు. ముస్తాబాద రైతు సేవా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సహాయకులు, రైతులతో ఆయన ఏవో వై.రజనితో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయం తక్కువగా ఉందని, త్వరగా వెరిఫికేషన్ పూర్తి చేయాలని చెప్పారు. ఏడాదికి మూడు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్‌తో కలసి రూ.20వేలు అందిస్తుందన్నారు. సొంత భూమి గల రైతులకు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.



ముస్తాబాద రైతు సేవా కేంద్రంలో సమీక్షిస్తున్న ఏడీఏ సునీల్

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

తోట్లవల్లూరు: పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి సూచించారు. మండలంలోని గరికపర్రు అంగన్‌వాడీ కేంద్రం–2లో కిశోర వికాశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. కిశోర బాలికలు రక్తహీనతకు దూరంగా ఉండాలని నాగమల్లేశ్వరి తెలిపారు. ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవటం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. అలాగే వ్యక్తి గత పరిశుభ్రతపై కిశోర బాలికలు జాగ్రత్తలు వహించాలన్నారు.



గరికపర్రులో అవగాహన కల్పిస్తున్న నాగమల్లేశ్వరి

విద్యుత్ కోతలతో నరకం

నందివాడ: మండలంలోని పోలుకొండ, ఇలపర్రు, విరివాడ, తుమ్మలపల్లి రుద్రపాక గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. సమయం, సందర్భం లేకుండా అడ్డగోలుగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలే ఎండలు మండిపోతున్నాయి. దీనికి తోడు విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అడ్డగోలుగా కోతలు విధిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ కోతలతో నరకం అనుభవిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులకూ గుర్తింపు కార్డులు

ముదినేపల్లి రూరల్: అర్హులైన ప్రతి కౌలు రైతుకూ గుర్తింపు కార్డులు అందేలా సహకరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ పవన్‌కుమార్, వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై (సీసీఆర్‌ఎ)పై అవగాహన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గుర్తింపు కార్డుల వలన కౌలు రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. భూ యజమాని అంగీకారంతో కౌలు రైతులు కార్డులు తీసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. భూ యజమానుల హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లదని కేవలం 11 నెలల కాల పరిమితితోనే గుర్తింపు కార్డులు జారీ చేస్తారని తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

లక్ష్మీనారాయణుడి కల్యాణోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: మండలంలోని చేవూరు శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి, స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. శనివారం రాత్రి స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

నేడు తిరంగా యాత్ర

గుడివాడ టౌన్: భారత్–పాకిస్థాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో భారత్ సాధించిన ఘన విజయానికి గుర్తుగా శనివారం సాయంత్రం తిరంగా యాత్రను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ గుడివాడ పురపాలక సంఘం కార్యాలయం నుంచి బయలు దేరుతుందని పేర్కొన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మున్సిపల్ ప్రత్యేక అధికారి ఆర్డీఓ జి. బాల సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు పాల్గొంటారన్నారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పట్టణ ప్రజలు, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాలికల హక్కులపై అవగాహన



బాలికల హక్కులపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ షాహిదాఖానం

కైకలూరు: విద్యార్థి దశ నుంచి బాలికలు వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహిదా ఖానం అన్నారు. పెంచికలమర్రు ఉన్నత పాఠశాల్లో వేసవి ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా కిశోరి వికాసం 2.0 అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సైదు మోషే అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల బాలికలకు పిల్లల హక్కులు, పోక్సో చట్టం, ఉచిత నిర్బంధ విద్య, బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిరోధం వంటి ప్రాముఖ్యతలు తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏఎన్ఎం రజనీ యుక్త వయస్సులో ఆరోగ్య సంరక్షణ, పలు దశల్లో తీసుకోవాల్సిన టీకాలు, చేతుల శుభ్రత వంటి విషయాలను వివరించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంటు శ్రీరామ్, మహిళా సమైక్య నాయకురాలు సుగుణ, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, సహాయకురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

ముదినేపల్లి రూరల్: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలు ఒక్కసారిగా సేదతీరారు. ఇటీవల రోజు విడిచి రోజు వర్షం కురుస్తుండగా మూడు రోజులుగా వర్షాలు రాక ఎండలు మండిపోతూ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో శుక్రవారం తెల్లవారుజామున ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. గంటన్నరపాటు విడవకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వడాలి నుంచి తామరకొల్లు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. 88.2 మిల్లీ మీటర్ల వర్షపాతం మండలంలో నమోదైనట్లు స్థానిక రెవెన్యూ వర్గాలు తెలిపాయి.



వల్లూరుపాలెంలో మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతులు

విద్యుత్ సరఫరాకు 12 గంటల అంతరాయం

గుడ్లవల్లేరు: మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం శుక్రవారం కురిసింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో పిడుగులు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 12గంటల పాటు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌లైన్ల మరమ్మతుల పనులపై తమ సిబ్బంది నిమగ్నమయ్యారని ట్రాన్స్‌కో ఏఈ వరకుమార్ తెలిపారు.



గుడ్లవల్లేరులో ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేరు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

అకాల వర్షాలతో హడలిపోతున్న రైతులు

తోట్లవల్లూరు: అకాల వర్షాలు రైతులను హడలెత్తిస్తున్నాయి. పంట చేతికందే సమయంలో కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తోట్లవల్లూరుతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. ఉరుముల శబ్దాలకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వాతావరణంలో మార్పులు, అకాల వర్షాలతో లంకల్లో ఆరబెట్టిన మొక్కజొన్నను రైతులు పరదాలతో సంరక్షించుకోవటానికి ఇబ్బందులు పడుతున్నారు. 10 రోజులు వాతావరణం సహకరిస్తే గట్టెక్కుతామని, లేదంటే సాగు నష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వల్లూరుపాలెంలో మొక్కజొన్న పొత్తులను పరదాలతో కప్పిన రైతులు



వర్షంతో బురదమయంగా మారిన వడాలి-తామరకొల్లు ఆర్అండ్‌బీ రోడ్డు

బస్టాండ్‌ను బాగుచేయండి

గుడివాడ టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ చినుకు పడితే చెరువులా మారుతోందని సీపీఎం గుడివాడ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ప్రయాణికులతో కలిసి వర్షం నీటిలో ధర్నా చేశారు. వర్షం వస్తే బస్టాండ్‌లోకి రావడానికి ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. గత ప్రభుత్వం బస్టాండ్ అభివృద్ధికి రూ. 22 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రూ. 12 కోట్లతో సగం మెరకచేసి డిపో, కార్యాలయం నిర్మించారని మిగిలిన పనులకు టెండరు పిలిచేలోగా ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయన్నారు. ఆ బడ్జెట్‌లో మిగిలిన రూ. 10 కోట్లతో పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్. కొండ, సురేంద్ర, ఏఐటీయూసీ నాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వర్షం నీటిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

పెదపారుపూడి: వేసవిలో మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్, ఎంజీఎన్‌జీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మోపర్రు గ్రామంలో ఫిల్టర్ బెడ్స్ కోసం మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు వెంటనే పనులు ప్రారంభించి, పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసూలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యద్ సాధిక్, ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షెహనాజ్, గృహనిర్మాణ ఇన్‌చార్జి ఏఈ ఫణికుమార్, ఏపీఓ సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోగం సురేష్

గుర్రపుడెక్క నిర్మూలనకు రూ.90 లక్షలు

పమిడిముక్కల: వీరంకి సెక్షన్ పరిధిలోని కాలువల్లో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపునకు రూ.90 లక్షలు మంజూరైనట్లు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ తెలిపారు. వీరంకి లాకు ఇరిగేషన్ కార్యాలయంలో నీటి వినియోగదారుల సంఘాలకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సంఘాల అధ్యక్షులు ఈ నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. కాలువల చివరి భూములకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో పూడికతీత పనులకు నిధులు మంజూరు చేయాలని నీటి సంఘాల అధ్యక్షులు కోరారు. సమావేశంలో ఏఈ సత్యనారాయణ, కృష్ణాపురం, కోసూరు డీసీ చైర్మన్లు నాదెళ్ల సుబ్రమణ్యం, చలపాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, డీసీ చైర్మన్లు

రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి

పామర్రు: రోడ్డు భద్రత నియమాలను వాహనచోదకులు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పామర్రు– దిగమర్రు జాతీయ రహదారిలో వాహనాల తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెలిమెట్‌ను ధరించాలన్నారు. 70 వాహనాలు తనిఖీలు నిర్వహించారు. 13 వాహనాలకు పెండింగ్ ఉన్న అపరాధ రుసుం రూ.3,800ను చెల్లించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.